ఆత్మపరీక్ష

★

శ్రీ పన్యాల రంగనాధరావు

1

"నేనెందుకు పనికొస్తాను?" అనుకున్నాడు శ్రీనివాసరావు. తన ప్రశ్నకు వెంటనే తనే సమాధానం చెప్పుకున్నాడు.

"ఎందుకూ పనికి రాను!" అని!

ఈ విధంగా సమాధానం చెప్పుకోవటం, కేవలం చేతకాని పని అంటూ తోచిన మరుక్షణమే శ్రీనివాసరావు అభిప్రాయం మారింది.

"అదేం మాట? ఎందుకూ పనికిరాకపోవటమేమిటి? ఎవరు మాత్రం ఎందుకు పనికొస్తున్నారు? ఎవడికి తోచినట్టు వాడు ఎందుకో ఒకందుకు పనికొస్తున్నట్టే, నేనూ పనికొస్తున్నాను. నా ప్రయోజకత్వం నాదీ!" అనుకున్నాడు తను.

ఒక ఏడాదిపాటు పట్నంలో గడిపాక, మళ్లా స్వస్థలానికి వచ్చి, ఇరవై నాలుగు గంటలయిందేమో! అందరికళ్లూ తనమీదే ఉన్నట్టున్నాయి. అంతా తన్ను వింతగా అనుమానంగా చూస్తున్నట్టనిపించింది.

పట్నం వొదిలేసి, ఇప్పుడిట్లా రావటం ఎంతవరకూ సమర్థించుకోవచ్చును?

తను చేసే ఒక పనికీ కూడా ఒక నిర్ణయమంటూ ఎన్నడూ ఉండటం లేదు. చేసేపనులు ఎట్లానూ చేస్తున్నాడు. పరిణామాలు చూస్తే మరొకవిధంగా ఉంటున్నాయి. తను చేసేపని ఎంతవరకూ సమంజసమనే ఆలోచనవస్తే, అది కేవలం సమంజసమే అని, అప్పటిమట్టుకు తోస్తున్నది. తీరా ఒక పని చేశాక, ఆపని ఎందుకు చేశానా అని, ఆ తరువాత పశ్చాత్తాపం చెందవలసివస్తున్నది. దీనంతటికీ కారణం ఏదీ కనిపించదు. ఆత్మపరీక్ష చేసుకోనే టప్పుడల్లా, అడుగడుగునా ఇటువంటి పశ్చాత్తాపాలు పడుతున్నాడు తను. ఆత్మపరీక్ష చేసుకోకుండా ఉండడం చేతకావటం లేదు తనకు.

ఈ ఆత్మపరీక్ష చేసుకోవటానికే, ఇంత సేపటికి తనకు, వ్యవధి అంటూ చిక్కింది.

ఇంటికి మైలుదూరంలో ప్రవహిస్తున్న శారదా నది అంటే శ్రీనివాసరావుకి ఎంతో ఇష్టం. నది వొడ్డున, ఎన్నడో తను చూసుకున్న ఏకాంతస్థలం, ఇప్పటికీ కూడా నిర్జనంగానే ఉంది. ఆ చోటు తనకెంతో నచ్చింది. తన ఆత్మపరీక్షలలోచాలాభాగం ఇక్కడే జరిగినై! ఇటూ అటూ, దాదాపు వంద గజాల దూరంలో, ఎవరో తెచ్చి పడేసినట్టు, రెండు పెద్ద బండరాళ్లు. రెండింటి మధ్యనుంచీ, నదిలో కొంత నీరు, చిన్నపాయగా, పోయేచోట, మరో చిన్నరాయి. సుమారు ఒక ఫర్లాంగుదూరంలోనే రైలు వంతెన. ఇరవై నాలుగుగంటల క్రిందట, సరిగ్గా ఇదే సమయానికి, మెయిలులో వస్తున్నప్పుడు ఈ వంతెన దాటాడు!

చిన్నరాతిమీద కూర్చొని, వెనకటి రోజులలో పద్యాలు రాసేవాడు శ్రీనివాసరావు. అక్కడే కూర్చొని, తను రాసిన రెండుమూడు నాటకాలు రేడియోవాళ్ళు ప్రసారం చేశారు! తను పత్రికలలో ప్రచురించిన అనేక కథలకు కూడా, తనకు 'ఇన్‌స్పిరేషన్' ఇచ్చింది, ఆ చోటే!

తన స్వభావం ఎటువంటిదో శ్రీనివాసరావుకి, బొత్తిగా తెలీదనలేం. దీనికి తన ఆత్మపరీక్షే బాగా దోహదంచేసింది. ఎందువల్లనంటే, తనవంటి స్వభావం కలవాడు, పద్యాలు అల్లటానికీ, కథలు రాయటానికీ పూనుకోవడం సాహస మనిపించింది. అయినప్పటికీ ఎదురొక్కకుండా ఉండటమూ లేదు. రాయటంమాననూ లేదు. తను రాసినవాటిలో యధార్థ జీవితం ఎంతవరకూ ప్రతిబింబిస్తున్నదన్న ఆలోచన వచ్చినప్పుడల్లా, అది తనకు చేతకాని పని అనిపించింది. వెంటనే మళ్ళా, చేతకాకపోవటమేమిటి? అనే అహంకారం బయల్దేరేది. దేశంలో ఈనాటి పరిస్థితులూ, ఆర్థికదుస్థితీ, ఎక్కువ తక్కువలూ, వర్గభేదాలూ, వర్ణభేదాలూ, వ్యత్యాసాలూ, రాజకీయాలూ, సాంఘిక దురన్యాయాలూ, ఇటువంటి వాటిలో ఇమిడిఉండే సమస్యలను ఆధారంగా చేసుకొని కథలు రాసేవాడు. అయితే కథ రాయకముందూ, అచ్చుకాకముందూ ఉండే ఉత్సాహం ఆతర్వాత ఉండేదికాదు. తను

రాసినదంతా యథార్థానికి దూరమనే అనుమానం తోచేది.

అయితే, ఇన్నాళ్ళ తరువాత, తను మళ్ళీ, ఈనాటికి, ఇదే చోటికి, కథ రాయటానికి గానీ, పద్య మల్లటానికి గానీ, రాలేదు. నిజానికి అందుకు అవసరమైన ఉద్రేకం కూడా కలగటం లేదు.

తన దృష్టిలో ఎంతో ఆదర్శప్రాయంగానూ ఏకాంతంగానూ ఉన్న ఈ చోటికి, వీటన్నింటి కన్నా మరో ప్రత్యేకత ఉన్న విషయం, శ్రీనివాస రావు ఇంత త్వరలో మరిచిపోలేడు. దాదాపు రెండేళ్ల కిందట, తన జీవితంలో ఎంతో మార్పు తీసుకొచ్చిన సంఘటన, సరిగ్గా ఇక్కడే జరిగింది. ఈ రెండేళ్లలోనూ తను పొందిన అనుభవాలకి అది నాంది అయింది. సరోజినిని, తను మొదటిసారి కలుసుకున్న సంఘటన అది!

ఎంత విచిత్రమైన వ్యక్తి - సరోజిని!

2

శ్రీనివాసరావుకి, ఆ రోజులన్నీ ఇప్పుడు మళ్లీ జ్ఞాపకం వచ్చి, కలవరపెట్టసాగినై. నిజానికి, ఈ రెండేళ్ల జీవితాన్ని ఆత్మపరీక్ష చేసుకోటానికే, తను మళ్ళీ ఈ చోటికి వచ్చాడు.

సరోజిని, తన జీవితంలో అడుగు పెట్టడానికి పూర్వమే, అప్పటికి, అయినకాటికి చదువుకి స్వస్తి చెప్పి, సంవత్సరమై జీవితాన్ని ఎదుర్కోవడం నేర్చుకునే ప్రయత్నంలో ఉన్నాడు తను. తండ్రి పెద్ద ఆస్తి లేవీ విడిచిపెట్టిపోలేదు. అతను ఒక దర్జా బతుకు బతికి హటాత్తుగా గుటుక్కుమన్నాడు. తండ్రి, ఆనందంగా అన్నీ అనుభవించాకనే పోవడం, తను పూర్తిగా ఆమోదించాడు. అయితే తండ్రి పోయి నప్పట్నుంచీ, తనూ తల్లీ, మామయ్య పోషణలో ఉండవలసివచ్చింది. ఇట్లా ఎంతకాలం సాగుతుందీ? ఇక తన బతుకేదో తనే చూసుకోవాలి.

ఇది, శ్రీనివాసరావు జీవితసమస్య. తండ్రి పోయి సంవత్సరం కావస్తున్నది. తనకు కేవలం పాతికేళ్ళే నిండినా, ముప్ఫయి అయిదేళ్లు నిండినట్టుంటున్నది. ఎందుకూ పనికి రాకుండానే, పెద్దవాణ్ణి అయిపోతున్నానేమా అనిపించేది. తన జీవితంలో అప్పుడే మొదటిసారి ప్రశ్నించుకున్నాడు కూడానూ—"నేనెందుకు పనికొస్తాను?" అని.

తన మనస్తత్వాన్ని ఆత్మపరీక్ష చేసుకోవడంతో, తనగురించి, తనకే భయం వేయసాగింది. తను చేయగలిగేది ఏమిటో స్పష్టంగా తెలీటం లేదు.

తను ఉద్యోగమనేది చేయగలడా? ఎటువంటి ఉద్యోగం చేయాలి? ఉద్యోగం అనేది ఎవరిస్తారు? తనకోసం ఏ ఉద్యోగం సిద్ధంగా ఉందనీ? అసలింతకీ, ఉద్యోగం అంటే ఏమిటి? ఇటువంటి ఉద్యోగప్రశ్నలన్నీ శ్రీనివాసరావుని బాధించసాగినై.

ఎమ్మేలు పాసవుతున్నవాళ్ళకు దిక్కులేకుండా ఉంటున్నది. తన్ను చూసేదెవరూ? తనకున్న చదువుకి ఏపాటి ఉద్యోగం వస్తుందీ? పట్నంపోయి, ఏ పత్రికలవాళ్ళనైనా ఆశ్రయిస్తే, ఇంత దొరక్కపోదేమో! తన రచనలతో పరిచయమున్న పత్రికలవాళ్ళలో ఒక్కరేనా కనీసం, తనకాపాటి ఆసరా కలిగించకపోరేమో!

ఈ ప్రయత్నం చేస్తే బాగానే ఉంటుందనిపించింది శ్రీనివాసరావుకి. తనవంటివాడికి ఇంతకన్నా వేరే ఆలోచనకూడా తట్టదనిపించింది. తను పట్నంపోయి ఉద్యోగం చూసుకొని వచ్చేవరకూ, తల్లి, మామయ్యదగ్గరే ఉంటుంది. మామయ్య కాదంటాడా?

ఆలోచించినకొద్దీ, ఈ పద్ధతే చాలా బాగా ఉందనిపించింది శ్రీనివాసరావుకి. ఉద్యోగం దొరికినా దొరక్కపోయినా, కొన్నాళ్లపాటు తిరిగి రావచ్చును. అదివరకు పట్నం ఎన్నడూ పోలేదు. ఇది ఒక మార్పుగా కూడా ఉంటుంది.

ఏదో ఒక పత్రికలో చేరవచ్చుననే ఆలోచన బాగానే ఉంది. కాని, ఏ పత్రికలో చేరాలి? ఎవరితో ఏం మాట్లాడితే, ఏం సమాధానం ఇస్తారో!

'ఉద్యోగమా?' అని ఎవరన్నా చిన్ననవ్వు విసిరితే తను ఏం చేయాలి? 'నువు ఉద్యోగం చేయటానికి కూడా పనికొస్తావా?' అనే అర్థం ఆ మాటలలో తనకు వెంటనే స్ఫురించకపోదు. తను ఎందుకు పనికొచ్చేటట్టు? ఈ ప్రశ్న మళ్లీ ఎదురైంది. చూస్తే,

ఇది, తన జీవితాంతం వెంటతరిమే ప్రశ్నలాగా కనిపిస్తున్నది. దీనికి సమాధానం ఏమిటి?

ఆట్టే మంది, తెలీనిచోట ఉద్యోగం దొరికేటంత సులభంగా, తెలిసినచోట దొరకదు. ఈ ముక్క తనకు చాలాకాలం కిందటే, ఒక మిత్రుడు చెప్పి పట్నం పోయినాడు. ఆ మిత్రుడు ఇప్పుడెక్కడుంటున్నాడో! వాడు—వాడిపేరు రామచంద్రం. ఏ సమస్యనైనా ఇట్టే ఎదుర్కొంటాడు. ప్రతీ చిన్న విషయానికీ, తనలాగ ఆటే మథనపడడు: తనకన్నా ఏ రెండుమూడేళ్ళో పెద్ద. అంతే. వాడు, చదువు మధ్యలోనే తెగ్గొట్టుకొనిపోయినాడు. ఆడవాళ్లను వల్లో వేసుకొనటంలో కనపరిచే నేర్పు, వాడు చదువులో కనపరచలేదు. అయితేనేం? స్నేహితుడుగా మంచివాడే. పట్నం పోగానే వాడికోసం వెదకాలి. వాడి ఎడ్రసేనా తెలిసిఉంటే తను ఉత్తరం రాసేవాడే!

అస్తిమితంగా ఉంటున్న తన ఆలోచనలకు, ఈ రామచంద్రం ఇట్లా జ్ఞాపకం రావటం, ఏదో గొప్ప సమస్య ఇట్టే విడిపోయినట్టనిపించింది శ్రీనివాసరావుకి.

3

శ్రీనివాసరావు 'పథకం' అడ్డం తిరిగింది! తన పథకానికి విరుగుడుగా, మామయ్య మరో పథకం ఏనాడో వేసుకొన్నట్టు కనిపించాడు.

"ఈ మాత్రానికి పట్నందాకా పోవాలిట్రా? చాల్లే, మన బతుక్కు ఇక్కడే ఏదో ఒకటి చూసుకోవచ్చు. నేను మాత్రం చూడటం లేదనుకున్నావా ఏమిటి?" అన్నాడు మామయ్య.

చూసిపెట్టాడు కూడానూ! సరిగ్గా తను చేస్తున్నటువంటి ఉద్యోగమే—మామయ్య, తనకు తెలిసిన ఒక ప్లీడరు దగ్గిర గుమస్తాగిరీ కుదిర్చాడు. ఇటువంటి ఉద్యోగం చేయటం చాలా అన్యాయమనిపించింది.

మామయ్యకు, తన అభ్యంతరం ఎందుకు తెలియచేయలేక పోయినాడో, శ్రీనివాసరావుకి అప్పట్లో తట్టలేదు. మామయ్యదగ్గర తనకు భయమని కాదు. మామయ్యపోషణలో ఉంటున్న తనకు, అభ్యంతరం చెప్పేటంత, ధైర్యం లేకపోయి ఉండొచ్చును. మామయ్య, సంవత్సరంపాటు, తిన్నా తన తల్లినీ పోషించటానికీ, తను పట్నం వెళ్ళకుండా చేయటానికీ, ప్లీడరు గుమస్తాపనిలో ప్రవేశపెట్టించటానికీ కారణం కూడా లేకపోలేదు!

తనకూతురు అరుంధతికోసం, తనను మొగుణ్ణి, మామయ్య, తన పథకంతో బంధించి వేసినట్టు స్పష్టమవుతూనే ఉంది. అరుంధతిని తనకే కట్టిపెట్టాలని, మామయ్య మొదట్నుంచీ ఆలోచిస్తున్న విషయం కొత్తకాదు.

అరుంధతిమీద తన మనసు పోయిందీ లేనిదీ స్పష్టంగా తెలీలేదు. ఆ పిల్ల, చూపులకి ఫరవాలేదు. అయితేనేం? చాకలిపద్దు చూడటానికి కావలసిన అక్షరజ్ఞానం కూడా లేదు. ఇంట్లో ఆ పిల్ల, బండ చాకిరీ చేస్తూఉండటం తను నిత్యం చూస్తున్నటువంటిదే. తన మామయ్య 'పథకం' ప్రకారం, ఇక మిగిలింది, అరుంధతిని, తన కిచ్చి పెళ్లిచేయటమే!

సరిగ్గా, ఇటువంటి పరిస్థితిలోనే శ్రీనివాసరావు జీవితంలో సరోజిని అడుగుపెట్టడం తటస్థించింది.

తన ఇష్టాయిష్టాల ప్రసక్తి లేకుండా మామయ్య ఇష్టానుసారం నడుస్తున్న తనకు వ్యక్తిత్వం ఎక్కడుంది? తనమట్టుకు తనే నిర్ణయించుకుని, ఆప్రకారం చేసుకోగలిగే శక్తి ఎక్కడుంది?

ఇంతకీ తను ఎందుకు పనికొస్తున్నట్టు?

ఈ ఆలోచనలతోనే, ఒకనాడు తను తన ఏకాంతస్థలానికి పోగా, తను కూర్చొనే రాతిమీదనే సరోజిని కూర్చొనిఉంది!

అంతకు ముందు సరోజిని ఎవరో తనకు తెలీదు. రెండుమూడు రోజులక్రిందటే సరోజిని అక్కడికి వచ్చింది.

"మీకోసమే నేను వెతుక్కుంటూ వచ్చాను" అని, సరోజిని, మాటల సందర్భంలో అంటే, తను నమ్మలేదు. సరోజినిమీద అనుమానంకూడా వేసింది తనకు.

సరోజినికి పాతికేళ్లుంటై. చూసిననాడే, తన కళ్లు చెదిరినై. స్త్రీలో ఎటువంటిఅందముంటుందో తనకు అర్థమయినట్టయింది.

సరోజిని, తన్ను వెతుక్కుంటూ వచ్చానన్న మాటలో, దాపరిక మేమీ కనపరచలేదు. కుండ పగలేసినట్టుగా, ఎబ్బెట్టుగా ఉంటై ఆవిడమాటలు.

"నాలాగ మాట్లాడే స్త్రీకి పిచ్చెక్కిం దనుకుంటారు. అవునా?" అన్నది సరోజినే ఒకనాడు.

"నీలాగ మాట్లాడగలిగే స్త్రీకోసమే నే నెదురు చూస్తున్నాను. అసలు, ఇటువంటి స్త్రీ ఉంటుందా? అని చాలాకాలం ఆలోచించాను. నువు కనిపించావు." అన్నాడు తను.

"నావంటి స్త్రీని తీసుకొని, మరొక కథ రాయండి. చదవాలని ఉంది. నా కథే రాస్తే బాగుంటుందేమో!" అన్నది సరోజిని!

4

సరోజిని కథ యావత్తూ తెలుసుకోటానికి శ్రీనివాసరావుకి ఆట్టే కాలం పట్టలేదు. ఒక వారం రోజులలో సరోజినే తనకంతా చెప్పింది.

బియ్యేలో ప్రవేశిద్దా మనుకుంటూ ఉండగానే, సరోజిని చదువు మానెయ్యాలిసివచ్చింది. తల్లీ తండ్రీ అన్నయ్యా కలిసి బలవంతాన పెళ్లి చేశారు. ఆపెళ్ళికి తన ఇష్టాయిష్టాలతో ఆట్టే పనిలేకపోయింది. భర్త బాగా డబ్బున్నవాడు. వ్యాపారి. సరోజినికి అప్పట్లో పెళ్ళిపట్లా, భర్త పట్లా, ఎటువంటి గాఢమైన అభ్యంతరాలూ కనిపించలేదు. పెళ్లి అయినాకనే, భర్త తన్ను ద్రోహం చేసినట్టూ, తన వాళ్లను మోసంచేసినట్టూ తెలుసుకున్నది. మోసాన్ని తనవాళ్ళు సులభంగా క్షమించి మరిచిపోయినారు గాని, తనకు జరిగిన, ద్రోహం మాత్రం సరోజిని క్షమించ దలచలేదు. తన భర్తకూ, బొంబాయిలో ఉంటున్న ఒక పార్సీయువతికీ సంబంధం ఉన్నట్టు కాపరానికి వెళ్లినప్పుడే తెలిసింది. తన కున్న విద్యాసంస్కారంతో భర్తకు తన అసమ్మతి తెలియచేస్తే, ఆయన కొట్టొచ్చాడు.

పార్సీదాన్ని వొదిలేస్తే, కాపరం చేయటానికి తన కాట్టే అభ్యంతరం లేదనికూడా భర్తకు చెప్పి చూసింది.

'నా సొంతవ్యవహారంలో నీకు జోక్యం అనవసరం' అన్నాడు భర్త.

'అయితే నీతో నేను కాపరం చేయలేను' అన్నది సరోజిని.

పొమ్మన్నాడు భర్త. సరోజిని ఇంటికి వచ్చేసింది.

భర్త, పార్సీదాన్ని పెళ్ళిచేసుకోవడాని పోతూపోతూ, సరోజిని ఎవడితోనో లేచిపోయినట్టు పుకారు లేవదీసి మరీ పోయినాడు. తన తల్లిదండ్రుల్లాంటివాళ్ళూ, అన్నయ్యల్లాంటివాళ్ళూ ఆపుకారుని పూర్తిగా నమ్మారు. ఎందుకు నమ్మారో సరోజినికి అర్థంకాలేదు.

సరోజిని ఇంటికి విచ్చేస్తే, జరగవలసిన ఆదరణ జరగలేదు. సరోజినికి ఒక చెల్లెలుంది. ఆ చెల్లెలికీ, తనకూ మాటలు లేకుండాకూడా చేశారు.

తను ఎలాగూ లేచిపోయినట్టు అంతా నమ్మినప్పుడు, తనకు నచ్చినవాడితో నిజంగానే లేచిపోవడంలో తప్పేమీ లేదనే నిర్ణయానికి వచ్చింది సరోజిని.

సరోజిని, ఈ విషయం చెపుతున్నప్పుడు, ఆమె తననే వెతుక్కొని వచ్చిందని నమ్మాడు శ్రీనివాసరావు.

'దిక్కులేని పిల్ల' అనే పేరుతో తను రాసిన ఒక కథ సరోజినికి బాగా నచ్చటానికి, సరోజిని పొందిన అనుభవాలే కారణమయ్యాయంటూ కూడా సరోజిని చెప్పింది.

ఆ కథ చదివాకనే, పత్రికవారికి ఉత్తరం రాసి, శ్రీనివాసరావు ఎడ్రసు కనుక్కొని, సరోజిని మరి ముందూవెనకా ఆలోచించకుండా లేచివచ్చినట్టు కూడా చెప్పింది.

ఇక్కడే ఆడపిల్లల స్కూలులో టీచరుగా ఉంటున్న ఒక స్నేహితురాలి ఇంట్లో సరోజిని బస చేసింది.

తన్ను సరోజిని, ఎట్లా కనుక్కొని కలుసుకోగలిగిందో విన్నప్పుడు, శ్రీనివాసరావుకి నవ్వుకూడా వచ్చింది.

"ఇక్కడికొచ్చాక, మొన్న బుక్‌స్టాలులో ఏదో పుస్తకం తిరగేస్తూ ఉండగా, అక్కడ మిమ్మల్ని ఇంకెవరితోనో చూశాను. మీ సంభాషణ విన్నతరువాత, మీరే ఫలానా అని తేల్చుకు

న్నాను. నిన్న, నేనూ నా స్నేహితురాలూ ఈవైపు వచ్చాం. మిమ్మల్ని, ఈ రాతిమీద దూరంనుంచే చూసి పోల్చుకున్నాను. నా స్నేహితురాల్ని అడిగాను కూడానూ. తను అప్పుడప్పుడు మిమ్మల్ని ఇక్కడ చూస్తూ ఉంటుందిట. మీ రెవరో మాత్రం తెలీదన్నది. ఇక మిమ్మల్ని కలుసుకోవటం ఏమంత కష్టమైన పనీ!" అన్నది సరోజిని.

స్త్రీలో తను ఇటువంటి విభిన్నమైన స్వభావం కోసం ఎదురుచూసిన మాట నిజం. అది సరిగ్గా ఈనాటికి, ప్రత్యక్షం కాగానే అదే తన్ను ఆకర్షిస్తున్న అనుమానం వేసింది శ్రీనివాసరావుకి.

ఇప్పుడీ సరోజిని బతు కేం గాను? తనగురించి ఆలోచనలన్నీ పోయి శ్రీనివాసరావుకి, సరోజిని గొడవ పట్టుకుంది. ఆలోచించినకొద్దీ, తను పరస్త్రీ వ్యామోహంలో పడుతున్న అనుమానం బాధించసాగింది.

నెల్లాళ్లు గడిచిపై... రెండు నెలలు గడిచిపై. మూడో నెల కూడా కావస్తున్నది.

ప్లీడరు గుమాస్తా చాకిరీమూలాన, తను సాయంకాలాలపూట, తన ఏకాంతస్థలానికి వెళ్లటం ఆలస్యమవుతున్నది. ఒక్కొక్కనాడు అసలు వెళ్లటం పడేది కాదు.

సరోజిని మట్టుకు రోజూ పని పెట్టుకువచ్చేది. తను వచ్చేదాకా ఎదురుచూసేది. ఒక్కొక్కనాడు, 'నిన్న మీరు రానేలేదే!' అనేది. తను వచ్చాక, ఇద్దరూ ఎన్ని విషయాలు మాట్లాడేవారో, ఎన్ని వర్ణించేవారో అంతు ఉండేది కాదు. ఈ ప్రపంచమంతా వారి చర్చలో గిర్రున తిరిగిపోయేది.

ఒకనాడు తను సరోజినిని అడిగాడు.

"నువేం చేయదల్చుకున్నావు?" అని.

"ఉద్యోగం చేస్తాను!" అన్నది సరోజిని.

"అంటే?" అన్నాడు తను.

"ప్రైవేటుగా బియ్యేకీ, ఆ తర్వాత బియిడికీ కట్టాలనుకుంటున్నాను."

"నువు ఉద్యోగం చేయటం నాకు ఇష్టం లేదు సుమా, నన్నడిగితే!" అన్నాడు తను.

"నాకు మరి తిం డెవరు పెడ్తారు? నా స్నేహితురాలు ఎంతకాలం భరిస్తుందనీ?"

"నీకు తిండి పెట్టేవాళ్లుంటే, మానేస్తావా?" అన్నాడు తను.

"అప్పు డాలోచిస్తాను. ఇప్పుడేం తొందర?"

సరోజినితో తనకు లభించింది సాహచర్యమా, సాన్నిహిత్యమా అనే సందేహం ఒకటి, కొత్తగా కలిగింది శ్రీనివాసరావుకి. ఏమయినా, ఇప్పుడు, అరుంధతిఅంటే విముఖత్వం పుట్టుకొస్తున్నది. కొద్ది కాలంలోనే అరుంధతిని తనకిచ్చి పెళ్ళిచేయటానికి మామయ్య స్థిరసంకల్పంతో ఉన్నాడు. ఇది తప్పించుకోవట మెట్లా? తప్పించుకోవాలన్న అభిప్రాయం ఎందుక్కలిగింది? సరోజినిమీద తనమనసు పోతున్నదా? సరోజినికూడా ఇటువంటి ఉద్దేశంతోనే ఉన్న దనుకోవాలా? ఉండకుంటే, 'తన కోసం' వచ్చి, ఇక్కడ ఎందుకు మకాం వేస్తుందీ?

మొగుడొదిలేసిన ఆడదానిమీదనా తన మనసు పోవటం?

ఇంతకీ, తన కున్న విశ్వాసా లేమిటి?

ఇంత సంస్కారంగల సరోజినిని వదిలేసిన ఆ మొగుణ్ణి ఏమనాలి? ఇప్పుడు తను సరోజినిని ఉద్ధరించటానికి ఎందుకు పూనుకోరాదూ? అయితే, ఈ ఉద్ధరింపు సరోజినికి ఇష్టమవుతుందా?

అరుంధతిని తను పెళ్లిచేసుకోకపోతే, తన బాబులాంటివాణ్ణి మరొకణ్ణి, మామయ్య గేలం వేయకపోడు.

కాని, సరోజిని చరిత్ర తెలిసినవాళ్ళు, ఎవరు మళ్ళీ సరోజినిని ఆదరిస్తారు? ఆ పని తనే చేయాలని రాసిపెట్టినట్టుంది.

ఈ లోపునే మరో బెడద వచ్చిపడింది. తనకు ఎవతెతోనో సంబంధం ఉన్నట్టు, ఊళ్లో ఒక పుకారు లేవటమే కాక, ఆ సంగతి మామయ్యకూ, అమ్మకూ కూడా తెలిసినట్టు అనుమానం కలిగింది. అందరూ తన్ను వింతగా, కొత్తగా చూస్తారే గాని, 'నువు ఇటువంటి పని చేస్తున్నట్టు మాకు తెలిసింది. అది మా కెవరికీ ఇష్టంలేదు' అని స్పష్టంచేయరు. ఎవరికీ ఇష్టం లేనట్లే ఉన్నప్పటికీ!

ఈమధ్య తల్లి మొహం చూడాలంటే బొత్తిగా సిగ్గవుతున్నది. అంటే, తను చేస్తున్నపని, చెడ్డపనికిందే, తనుకూడా జమకట్టుకొని, అందుకు తను

పశ్చాత్తాపపడుతున్నానా అనుకున్నాడు శ్రీనివాస రావు.

"పశ్చాత్తాపం ఎందుకూ? నేను చేస్తున్నదే నాకు మంచిదిగా తోస్తున్నది" అనుకున్నాడు మళ్లీ.

5

"ఏంరా? నువు సరిగా పనిచేయటం లేదుట?" అన్నాడు మామయ్య ఒకనాడు.

"ఎవరు చెప్పారూ?" అన్నాడు తను.

"ఎవరు చెప్తారేమిటి? ఆ ప్లీడరుగారే చెప్పారు. నువేమో ఒకటి రాయబోయి ఒకటి రాస్తావుట. సాయంకాలం అయిదు కొడితే మరి కనపడవుట."

"ఆ ముక్క నా ముఖంముందే ఎందుకు ఏడవ లేకపోయినాడూ?" అన్నాడు తను!

"ఇది మరీ బాగుంది! పెద్దమనిషిగా ఉండక్కర్లే? అతనికి నిన్ను వొప్పగించినవాణ్ణి నేనూ!"

"అక్కర్లేకుంటే, ఉత్తరక్షణంలో మానెయ్యటానికి సిద్ధంగా ఉన్నాను". అన్నాడు తను.

"ఏం? ఉద్యోగాలు పాచిపోతున్నాయనా మనవంటి వాళ్లకి?"

"ప్రపంచంలో ఈ ఒక్క ఉద్యోగా లే ఉన్నటు మాట్లాడతా వేమిటి మామయ్యా? రేపట్నుంచి, మానేస్తున్నానని చెప్పెయ్యి" అన్నాడు తను. ఇట్లా అనటానికి తనకు ధైర్యం ఎలా వచ్చిందా అని ఆశ్చర్యపడుతూనే.

"నువు మానటానికి వీలులేదు. నీ సంగతి నాకు బొత్తిగా తెలీదనుకుంటున్నా వేమో!" అన్నాడు మామయ్య, హెచ్చరిస్తున్నట్టుగా.

మామయ్యతో తను ఆ శే చర్చించదలచుకో లేదు.

ఆ సాయంకాలం, తను సరోజినిని కలుసుకొన్నప్పుడు, తను వేసిన మొదటి ప్రశ్న: "మనది సాన్నిహిత్యమా? సాహచర్యమా?"

"అంటే?" అన్నది సరోజిని.

"నీకర్థం కాలేదంటే నమ్మలేకుండాఉన్నాను సరోజిని!" అన్నాడు తను.

సరోజినీ కాస్సేపు ఆలోచించి,

"అయితే, రెండూనూ!" అన్నది.

ఆ సమాధానంతో, తన అనుమానాలన్నీ పటాపంచలయినట్టయింది శ్రీనివాసరావుకి. ఇన్నాళ్ళూ, ఈ సరోజినిని కలుస్తున్నప్పటికీ తాకితే తంతుందేమో అన్నంత అనుమానం పీడిస్తూ ఉండేది తనకు. ఈ అనుమానానికి కారణం కూడా సరోజిని ధోరణే. కొన్నాళ్లు చంచలమైన మనసు కలదనుకొన్నాడు. ఈ పిల్ల, ఎవరితోనూ కూడా కాపరం చేయలేదనుకున్నాడు. ఇల్లు వదిలిపెట్టి వీధినిపడ్డ స్త్రీ అనుకున్నాడు. ఎన్ని అనుకున్నా, తన మనసుమాత్రం వేధిస్తూనే ఉండేది. సరోజినిని కలుసుకోకపోతే ఉండలేననిపించేది. సరోజినిని చూసినప్పుడల్లా, గుండె కొట్టుకొనేది.

నీటిలో మునుగుతూ తేలుతూ, చివరికి ఏదో ఒక ఆధారంగా పైకొచ్చి, మింగిన నీరంతా కక్కినవాడిలాగా ఉన్నది ఇప్పుడు శ్రీనివాసరావుకి.

సరోజినికి దగ్గరగాపోయి వణకుతున్న చేతులతో, ఆమె చేతులు పట్టుకున్నాడు తను. సరోజిని అభ్యంతరం చెప్పలేదు.

తన కంతకంతకూ ధైర్యం ఎక్కువవుతున్నట్టు భావించసాగాడు.

"నేను చాలా తప్పపని చేస్తున్నానేమో!" అకుకున్నాడు. ఆ మాటలు తనకు తెలీకుండానే పైకివచ్చినయ్.

"మీరేంచేశారు తప్పు?" అన్నది సరోజిని.

శ్రీనివాసరావు సమాధానం ఇవ్వలేదు.

"మనం ఇట్లా ఉండటం మీకు తప్పగాతోస్తే, నా మానాన నేను పోతాను. మీరు మరేమీ అనుకోకండి. ఇంతకు మునిగిందేముందీ?"

"నువట్లా అనుకుంటున్నావా సరోజినీ?" అన్నాడు తను.

"మీకు తెలీలేదంటే, ఇప్పుడు నేను నమ్మలేకుండా ఉన్నాను!" అన్నది సరోజిని నవ్వుతూ. అప్పుడు తను కూడా నవ్వాడు.

పదినిమిషాలు గడిచినై.

"నేను రేపు పట్నం పోవాలనుకుంటున్నాను" అన్నాడు తను.

"ఎందుకూ?"

"ఉద్యోగానికి!" అన్నాడు తను.

ఉద్యోగంకోసం ఎందుకు పట్నం వెళ్ళాలని నిశ్చయించుకున్నదీ చెప్పాడు తను.

"నువిక్కడేం చేస్తావు?" అన్నాడు మళ్లీ.

ఈ మాట లంటున్నప్పుడు, తన గుండె మరో సారి తీవ్రంగా కొట్టుకోడం ప్రారంభించింది.

"చెప్పాగా!" అన్నది సరోజిని.

"నాకు తోచిన ముక్క చెప్పమన్నావా?" అన్నాడు తను. గుండె దడ ఎక్కువయింది.

"చెప్పండి .."

"నువేమీ అనుకోకపోతే—చెప్పటానికి—ఇన్నాళ్లి కిప్పుడు సాహసిస్తున్నాను" అన్నాడు తను. గుండె దడ ఇంకా ఎక్కువయింది.

సరోజిని నవ్వింది.

"నువు కూడా పట్నం వచ్చేయరాదూ?" అనేశాడు తను. అమిత వేగంగా కొట్టుకుంటున్న గుండె, చప్పున ఆగిపోతుం దనిపించింది.

సరోజిని ఆలోచిస్తున్నది.

"నాతో వొచ్చేయటానికి, నీకు అభ్యంతరం లేదుగద!" అన్నాడు తను.

"లేదు" అన్నది సరోజిని.

రెండోకంటికి తెలీకుండా, మర్నాడు తను, సరోజినితోపాటు ఎట్లా మెయి లెక్కాడో తనకే తెలీ లేదు!

6

సరోజినితోపాటు, శ్రీనివాసరావు పట్నం చేరుకొని నెల్లాళ్లయింది. ఈనెల రోజులలోనూ ఒక బసకుదుర్చుకున్నాడు. పదిహేనురోజులపాటు పట్నమంతా గాలించగా, ఒక వారపత్రికలో ఉద్యోగం కుదిరింది. దాన్ని సంపాదకత్వం అనటానికి వీలు పడదు. పత్రిక అచ్చయి బయటపడి, నలుగురి చేతులకూ అందటానికి ఎన్నిపనులు చేయాలో, అన్నీ దాదాపు తనే చేయాలి. పత్రికాధిపతి 'కనిపెట్టిన' ఒకానొక 'సర్వరోగ నివారిణి'కి ప్రచారం చేసుకు రావటమే ఆ పత్రిక పరమార్థం. పత్రికాధిపతి, తనకు నెలకు మొదట్లో నూరు రూపాయలు ఇస్తానన్నాడు. పత్రికకున్న అయిదువేల కాపీల ప్రచారమూ పాతికవేలకు పెరిగినపుడు మరో యాభై ఎక్కువ చేస్తానని మాటిచ్చాడు.

సరోజిని, తను కూడా ఏదైనా చిన్న పనిలో ప్రవేశిస్తా నన్నది.

"చూతాం లెద్దూ" అన్నాడు తను.

హోటలునుంచి ప్రస్తుతం క్యారియర్ తెప్పించుకుంటే, ఇద్దరికీ ధారాళంగా సరిపోతున్నది.

ఒకనాడు తనకు, మామయ్య దగ్గర్నుంచి ఉత్తరం వచ్చింది.

"...నువిట్లా మా అందరి కళ్లూ కప్పి పారిపోవటం చాలా ఘోరం. నువు పట్నలో ఉన్నావనీ ఏదో పత్రికలో పనిచేస్తున్నావనీ తెలిసింది. నీకు ఉద్యోగం దొరికినందుకు మేమెవ్వరమూ సంతోషించటం లేదనుకోవద్దు. కాని, నువు ఎవతెనో లేవతీసుకుపోయినట్టు ఊరంతా గుప్పుమన్నది. నువు చేసిన పనివల్ల నేను తలెత్తలేక పోతున్నాను. ఇది నువు తెలీకుండా చేశావంటే నమ్మలేను. మీ అమ్మ నీకోసం బెంగపెట్టుకున్నది. నువు పట్నం పోతానన్నప్పుడు నిన్ను పంపించని తప్పు నాది. ఇప్పుడు నువు చేసిన పనికి నాకేమీ కోపం లేదు. వెంటనే వచ్చి పెళ్లి చేసుకుంటే సంతోషిస్తాను..."

వారం రోజులు పోయినాక దీనికి సమాధానం రాశాడు తను.

"...నువు నా మీద ఏమైనా ఆశపెట్టుకుంటే అది విడిచిపెట్టుకోవటమే మంచిది. ఇప్పట్లో నేను రాలేను. వీలున్నప్పుడు మాత్రం రాకపోను. బెంగపెట్టుకోనవసరం లేదని అమ్మకు చెప్పు. అమ్మకోసం డబ్బు పంపిస్తున్నాను..."

ఉత్తరంతో పాటు, పాతిక రూపాయలు ఎడ్వాన్సు తీసుకొని, మనియార్డరు చేశాడు శ్రీనివాసరావు.

సరోజినీ, తనూ దాదాపు భార్యాభర్తగానే చెలామణీ అయిపోతున్నారు. దీనికి కొంత నిజాయితీ కల్పిద్దామనే ఆశ తనకు లేకపోలేదు. అందుకే ఒకనాడు తను,

"మనం పెళ్లి చేసుకుందామా?" అన్నాడు.

"మీకు పెళ్లిలో అంత నమ్మకముందా? నాకు

ఒక పెళ్లితో కలిగిన అనుభవంతో అసలు నమ్మకం లేకుండాపోయింది!" అన్నది సరోజిని.

"మనల్ని చూసి అంతా భార్యాభర్తల మనుకుంటున్నార్లే!" అన్నాడు తను,

"అనుకోనీయండి. మంచిదేగా! ప్రజలట్లా అనుకోనటానికేగా పెళ్లి! మన గురించి అంతా అనుకోవలసిందే అనుకొంటున్నప్పుడు, వేరే తంతు కూడా జరగాలా ఏమిటి?...మీకిలా ఉండటం బాగా లేదా?"

"నాకింకా ఒక పెళ్లైనా కాలేదు మరి!" అన్నాడు తను!

"అయినా వాళ్ల అనుభవాలతో మీరు మీ దృక్పథం మార్చుకుంటారనుకున్నాను!"

"నీకు నాలో నమ్మకం లేదన్న మాట." అన్నాడు తను.

"పెళ్లిచేసుకోక పోయినంత మాత్రాన ఒకరి మీద ఒకరికి నమ్మకం ఉండదా?

ఉంటుందని మనం ఎందుకు ఋజువుచేయకూడదూ? నేను చేయదలచుకున్నాను."

శ్రీనివాసరావు, సరోజినితో అనవసరంగా వాదన పెంచుకోదలచలేదు. ఇంతవరకూ తను చవిచూడని స్వర్గసుఖం ఇప్పుడు సరోజిని ఇస్తున్నదనటంలో తన కెటువంటి సందేహమూ లేదు. ఈ స్వర్గసుఖాన్ని చేతులారా పాడుచేసుకోవటం మతిలేని పని! అయితే, పెళ్లిఅనేది జరిగిపోయిన పక్షంలో, తన వాళ్ళకి తెలీకుండా చేస్తున్నాననుకుంటున్న 'తప్పు' కాస్తా 'ఒప్పు'గా మారి, తన బాధ కొంత తీరుతుందని మాత్రం ఆశించాడు శ్రీనివాసరావు. పెళ్ళి అనవసరంలేదని సరోజిని ఖచ్చితంగానే చెప్పినట్టు భావించిన తనకు, కొద్దిగా ఆశాభంగం కలగకపోలేదు.

ఒకనాడు తను ఇంటికి వస్తూఉండగా హటాత్తుగా బస్సులో రామచంద్రం కనిపించాడు.

"ఏమోయ్! నువుకూడా చేరుకున్నావూ పట్నం! ఎక్కడేమిటి ఉద్యోగం?" అన్నాడు రామచంద్రం తన్ను చూడగానే.

"నువిక్కడే ఉన్నావన్నమాట! ఏం చేస్తున్నావు!" అన్నాడు తను.

రామచంద్రం తన పక్కనే ఖాళీగా ఉన్న సీటులో కూర్చున్నాడు.

"ఇక్కడికొచ్చాక ఇది నాలుగో ఉద్యోగం మనకి. ఈ జీవితం ఇంతే! ఒకటే మనకి స్థిరంగా ఉండేగా! ప్రస్తుతం ఒక ఇన్స్యూరెన్సు కంపెనీలో ఆర్గనైజర్ గా ఉంటున్నాను. బాగానే ఉంది. మరో ఆరు నెలల్లో మా వాళ్లు ఢిల్లీలో బ్రాంచి పెడ్తున్నారు. అక్కడికి బ్రాంచి మేనేజరుగా పంపుతామని మాట ఇచ్చారు." అన్నాడు రామచంద్రం.

"నీ పనే బాగుందిలే. మీ ఇల్లెక్కడ?" అన్నాడు తను.

"అడయారులో, ఇల్లు తీసుకున్నాన్లే ఒక్కణ్ణే! రాకూడదా నాతో? అన్నట్టు నువెక్కడున్నావు?"

"నేను మైలాపూరులోనే వుంటున్నాను. దిగు. ముందు మా యింటికి రా. తరువాత నీ యింటికి పోదాంలే" అన్నాడు తను.

"సంసారంతో సహా వచ్చావా యేమిటి?" అన్నాడు రామచంద్రం బస్సు దిగుతూ.

ఈప్రశ్నకు తను కొద్దిగా నవ్వాడు.

"ఎందుకు నవ్వుతావు?"

"ఏం చెప్పాలో తెలీక!" అన్నాడు తను.

"అంటే?"

"పెళ్లిచేసుకోబోతాంలే!"

"ఓహో! ఏదో పిట్టనుపట్టి తెచ్చావన్న మాట!" అనేశాడు రామచంద్రం తనవీపు చరుస్తూ.

తనకీమాట కొద్దిపాటి కష్టంగా తోచకపోలేదు కాని, తనేమీ సమాధానం ఇవ్వలేదు. మొదట్లో, తను అట్లా అనేసినందుకు మాత్రం శ్రీనివాసరావు నాలిక కొరుక్కున్నాడు. తనకు తెలీకుండా కొన్ని కొన్ని పనులు చేస్తూఉండటం, కొన్ని కొన్ని మాటలు అనేస్తూ ఉండటం జరుగుతూనే ఉంది. ఆత్మపరీక్ష చేసుకుంటే, వీటికి స్పష్టమైన కారణం కనపడదు. ఇక కొన్ని సమయాల్లో ముప్పు తెచ్చిపెట్టగలవని కూడా ఆ క్షణంలో తోచదు.

ఇల్లు చేరుకోగానే, తను సరోజినికి రామచంద్రాన్ని పరిచయంచేశాడు.

సరోజిని, ఇద్దరికీ కాఫీ తెచ్చిఇచ్చింది. తనూ ఒక కప్పు పుచ్చుకొని, వారితోపాటే కూర్చున్నది.

"ఇంతకీ నీ ఉద్యోగ మేమిటో చెప్పావు కావు!" అన్నాడు రామచంద్రం.

తన ఉద్యోగం గురించీ, నెలసరిజీతంగురించీ అన్నీ చెప్పాడు తను.

"ఈ రోజులలో ఏం సరిపోతుందీ?" మా కంపెనీలో చేరతావా?" అన్నాడు రామచంద్రం.

"ధన్యోస్మి! నేనాపని చేయలేను" అన్నాడు తను నవ్వుతూ.

"పోనీ, నేను పనికొస్తానా?" అన్నది సరోజిని. సరోజిని అట్లా ఆ ఘడియలో ఫుటెక్కున అనేస్తుందని తను ఊహించలేదు.

"మీరా!...మీరా!......" అన్నాడు రామచంద్రం. అతను అట్లా ఆశ్చర్యపడుతున్నప్పుడు, సరోజిని కళ్లలోకి చూస్తూఉండటం తను గమనించాడు.

"నాకు ఉద్యోగమంటూ చెయ్యాలని ఉంది చాలాకాలంబట్టి. ఇంట్లో ఇట్లా గడపటం కష్టం..." అన్నది సరోజిని.

"మీరు కోరితే, ఉద్యోగం ఇవ్వనివాళ్లెవరుంటారూ? ఆలోచిస్తాను." అన్నాడు రామచంద్రం.

"నేను బియ్యేలూ గియ్యేలూ పాసుకాలేదుసుమండీ!" అన్నది సరోజిని నవ్వుతూ.

"నేను పాసయ్యానా యేమిటి! బియ్యేలు పాసుకానవసరం లేకుండా దొరికే ఉద్యోగాలు కూడా లక్ష ఉన్నాయి!" అన్నాడు రామచంద్రం.

సరోజిని తనకేసి చూసింది. 'ఆయన నాకు ఉద్యోగం ఇప్పిస్తే, నేను చేయటం, మీకు ఇష్టమే అనుకుంటాను!' అన్నట్టుగా. ఆ చూపు తనకు అర్థమయింది. కాని, సరోజిని ఉద్యోగం చేయటం తనకు ఇష్టం లేదని ఎట్లా చెప్పాలో తెలీలేదు.

ఆ రాత్రి పడుకోబోయేముందు, శ్రీనివాసరావు ఆత్మపరీక్ష మళ్ళీ ప్రారంభమైంది. సరోజిని ఉద్యోగం చేయటం తనకు ఎందుకు ఇష్టం లేదు? ఆలోచించినకొద్దీ, ఇందులో తన స్వార్థం కొంత కనిపిస్తున్న మాట నిజం. కాని తనలో ఉన్న ఈ స్వార్థం, మగవాడన్నవాడికి, ఎవడికేనా కొద్దో గొప్పో ఉండకపోదు. ఆ స్వార్థం ఒక్కొక్కరిలో ఒక్కొక్క విధంగా ఉంటుంది. సరోజినిని పెళ్ళి చేసుకొని, తన సొంతం చేసుకోవాలన్న స్వార్థమే, సరోజిని ఉద్యోగం చేయటానికి ఒప్పుకోలేదు.

తన అభిప్రాయాలకు సరోజిని ఎదురుతిరుగుతున్నట్టు కనిపించసాగింది. మొన్నమొన్న కలసిన ఈ పొత్తుకి, ఇంత త్వరలోనే అడ్డంకులా!

సరోజిని, తన పోషణలోనే ఉండాలన్న భావంకన్నా, సరోజిని, కేవలం తనదే అయిపోవాలన్నభావం ఎక్కువగా ఉన్న తనకు, సరోజిని, అప్పుడే దూరమవుతున్న చిహ్నాలు పొడగట్టసాగినై.

ఎంతమంది భార్యలు ఉద్యోగాలు చేయటం లేదూ? వాళ్ళంతా హాయిగా బతకటం లేదూ? పోతే, సరోజిని, కనీసం తన భార్యన్నా కాదు. ఉద్యోగం చేస్తున్నప్పటికీ తనకు దూరమైపోదనుకోటానికి, ఇప్పుడు, నీ ఉద్యోగప్రయత్నం మానెయ్యి అనటానికి భార్యమీద ఉండే అధికారం తనకు సరోజినిమీద లేదు. భార్యకాదు గనక!

అసలు, ఇంతకీ, తనదే బుద్ధిపొరపాటేమో! ఆ రామచంద్రంగాణ్ణి, ఇంటికి తీసుకురావటం, ఇంత కొచ్చింది. వాడు వచ్చినట్టే వచ్చి, మెల్లగా పుల్ల పెట్టిపోయినాడు. వాడి సంగతి తనకేం తెలీదు గనక?

7

శ్రీనివాసరావు భావించినట్టే, ఆరాత్రి తనకూ సరోజినికీ కొంత ఘర్షణ జరిగింది.

"అయితే, నువు ఉద్యోగం చేయాలనే సంకల్పించావన్నమాట!" అన్నాడు తను.

"అందుకు మీరు ఇష్టపడితే నాకెంత ఆనందంగా ఉంటుంది!" అన్నది సరోజిని.

"నా కొచ్చేదాంతో, మనం కేవలం ముష్టి బతుకు బతకటంలేదుగా? నువు కూడా సంపాదన ప్రారంభించవలసినంత అవసరంలేదని నాతాత్పర్యం" అన్నాడు తను.

"శాస్త్రీ కూస్త్రీ చదువుకున్నాను గనక ఇంట్లో ఎట్లా గడపగలను చెప్పండీ! తలవొంపులకు గురి అయ్యే ఉద్యోగం కాదుగా! ఇంతకన్నా ఎక్కువ రాబడిఉంటే కాదంటామా మరీ!"

"రామచంద్రం సంగతి నీకు తెలీక అట్లా మాట్లాడుతున్నావు సరోజినీ! వాడు ఎంతకేనా తగినవాడు!" అనేశాడు తను మళ్లా! తనలో గూడుకట్టుకొన్న స్వార్థం తనకు తెలీకుండా, తన చేత ఇటువంటి మాటలు అనిపిస్తున్న విషయం శ్రీనివాసరావుకి చాలా కాలానికిగాని తెలిసిరాలేదు.

"పోనీ మీరు ఇంకెక్కడైనా, నాకోసం ప్రయత్నించి పెట్టండి. కాదన్నానా?" అన్నది సరోజిని.

"నా కిష్టంలేదు సరోజినీ!" అన్నాడు తను.

"మనం ఈ విషయంలోకూడా ఒక అభిప్రాయానికి రాలేకపోతున్నందుకు, నాకు విచారంగా ఉంది. చెప్పొద్దూ! పెళ్ళివిషయంలోకూడా మన అభిప్రాయాలు వేరైనై. పెళ్ళి అనే ఒక విధమైన ముడిలేకుండా బతకలేమా అనే నా పట్టుదల. స్వతంత్రంగా గణించుకోలేమా అనే నా విశ్వాసం. నా విశ్వాసాలమీద మీకు గౌరవం లేకపోవచ్చు. ఆడదానికి ఇటువంటి అభిప్రాయాలు కలగడం మీకు వింతగా తోస్తున్నదనుకుంటాను. నేనేం చేసేదీ!"

"అబ్బే! నీవంటిదానికి కలగవలసిన అభిప్రాయాలే కలుగుతున్నాయిలే, ఆశ్చర్యం దేనికీ?" అన్నాడు తను ఊరుకోకుండా.

శ్రీనివాసరావు తను ఊహించి, ఆమోదించిన స్వతంత్రానికీ, సరోజిని స్వతంత్రానికీ ఎక్కడా సంబంధంలేదు. తను అనుకున్న స్వతంత్రానికి పరిమితులూ సరిహద్దులూ కనిపిస్తున్నాయి. సరోజినిది సరిహద్దులులేని స్వాతంత్ర్య దృక్పథం అని తనకిప్పుడు తెలుస్తున్నది.

ఆ రాత్రికి, వారి సంభాషణ ఆటే సాగలేదు. శ్రీనివాసరావు మాత్రం, 'నేనేం చేయగలను? నేనెందుకు పనికొస్తాను?' అనే తన మామూలు ప్రశ్నలకు సమాధానాలు వెతుక్కొంటూ నిద్రపోయినాడు.

ఒక వారంరోజులు, ఉభయులూ, ఏమీ జరగనట్టే ఎట్లా ప్రవర్తించారో, తలుచుకుంటే, ఇప్పుడు తనకే ఆశ్చర్యం వేస్తున్నది.

ఈ మధ్య మామయ్య మళ్ళీ ఉత్తరం రాశాడు. "ఈ ఉత్తరం అందినవెంటనే నువు రాకుంటే, నేనే బయల్దేరి వస్తున్నాను, నీ తల్లిని ఎందుకంత దుఃఖపెడ్తావు చెప్పు?"

శ్రీనివాసరావుకి, పెద్ద ద్రోహం చేస్తున్నట్టు తోచసాగింది. సరోజినితో లేచివచ్చి, తను దాదాపు కాపరం వెలిగించటం గొప్ప నేరంగా తోచింది. అప్పుడే కొన్ని నెలలయింది తను ఈ కాపరంలో పడి!

ఆ వేళ పత్రికలన్నీ పోస్టుచేయవలసిన రోజు కావటంవల్ల, శ్రీనివాసరావు కొంచెం ఆలస్యంగా ఇల్లు చేరుకున్నాడు. దానికితోడు తలనొప్పి కూడా పట్టుకున్నది.

ఇల్లు చేరుకునేసరికి, ఇంటి తలుపు తాళంవేసి ఉంది.

సరోజిని, ఇట్లా, తనకు తెలీకుండా ఎన్నడూ ఇంతవరకూ, బయటకు వెళ్లలేదు.

ఇవేళ సరోజిని చేసిన ఈ పని తన గుండెలో పెద్ద గాయం చేసింది.

ఎక్కడికి వెళ్ళిఉంటుంది? ఆ రామచంద్రంగాడు వచ్చి తీసుకుపోలేదు కద!

తను ఊహించినంతా అయింది. చేసేదిలేక, తను వీధిలో ఎదురుచూస్తూ నిలపడ్డాడు. ఇంకో పది నిమిషాలకే సరోజిని వచ్చింది.

"వెధవది. బస్సు సరిగా దొరకలేదు. అడయారు వెళ్లివచ్చేను." అన్నది సరోజిని తాళంతీస్తూ,

"రామచంద్రం దగ్గిరికా?" అన్నాడు తను. పొంగివస్తున్న కోపం బలవంతాన అణుచుకుంటూ.

"ఆయనే సాయంకాలం వచ్చి, నాకు ఉద్యోగం దొరికిందన్నారు. ఆర్డరుమీద సంతకం చేయటానికి, కంపెనీకి రమ్మన్నారు. ఇంతలో పోయిందేముందని వెళ్లాను. అక్కడనుంచి, వాళ్లింటికి వెళ్ళాం." అన్నది సరోజిని ఏ మాత్రమూ తడుముకోకుండా.

"ఏమిటా ఉద్యోగం?" అన్నాడు తను ఇంకా కోపంతోనే.

"ఆ ఉద్యోగానికి, ఒక పేరంటూ లేదు. ఉత్తరాలు రాయడం, మొదలైన చిన్న పనులన్నీ చేయాలి. అంతే. నూరు రూపాయ లిస్తారు." అన్నది సరోజిని గదిలోకి పోతూ.

ఆమె వెంట తనూ గదిలోకి వెళ్లాడు.

"మీకు చాలా కోపం వచ్చినట్లుంది. ఇంతలో ఏం ప్రమాదం జరిగిందనీ?" అన్నది సరోజిని, తన వేపు తిరిగి.

"ఉద్యోగంలో, నీ యిష్టం ప్రకారం చేరావు. నువు స్వతంత్రురాలివి. నిన్ను నేనేమనగలను? ఏమనటానికీ నాకు హక్కు లేదు. నీలో నేను చూశానను కున్న స్వతంత్రం, ఈ విధంగా పరిణమిస్తుందని మాత్రం, నే ననుకోలేదు. ఉన్నమాట చెప్తాను" అన్నాడు తను కొంత కసితీర్చుకుంటూ.

"మీ రట్లా భావిస్తే, నేను మాత్రం ఏం చెప్పేదీ? ఈమాత్రం దానికి, ఆయన నన్ను ఎత్తుకు పోవటం లేదుకద!" అన్నది సరోజిని.

"దానికే ఇది నాంది" అన్నాడు తను తనకు తెలీకుండా చప్పున.

8

రామచంద్రం పూర్తిగా తన్ను మోసం చేశాడనాలి. వాడు సరోజినిని కాస్తా తన్నుకుపోవాలనే చూస్తున్నాడన్నది స్పష్టంగా తెలుస్తూనే ఉన్నది. ఉద్యోగ మిప్పించినట్టు ముఖ్య పెట్టినవాడు ఇంకా ఏదన్నా చేయగలడు. కాని, త నేం చేయాలి? ఎందుకు పనికొస్తున్నట్టు? సరోజినిని తను ఇంత గాఢంగా ప్రేమిస్తున్న విషయం సరోజినికి తెలీదా? ఆమె, తన్ను ఇన్నాళ్లూ ప్రేమించడం లేదా? బతుకు తెరువు చూసుకోటానికి సాగించిన నటనేనా?

ఈ క్షణంలో, రామచంద్రంతో పోట్లాడగలిగే శక్తి తన కున్నదా? ఒక ఆడదానికోసం ఇద్దరు కుమ్ములాడుకోవడం ఎంత నీచం? తన జీవితంలో ఈ ఘట్టం ఏదో ఒక మామూలు సినీమా కథలాగా పరిణమించటం ఎంత దురదృష్టం!

ఇక, సరోజిని, తనకు తీరికగా ఉన్నప్పుడెల్లా కనిపించక పోవచ్చు. ఈ ఆలోచన కూడా స్వార్థంగానే ఉంది. సరోజినికి మట్టుకు స్వార్థం లేదనా! స్వార్థరహితంగా ఎవడు మాత్రం ఏపనిచేస్తాడు? స్వార్థరహితంగా ఉండాలనుకోనటం కూడా ఎవరో అన్నట్టు, స్వార్థమే కాకుంటే మరేమిటి?

నెలరోజులు గడిచినై. రోజులన్నీ మామూలుగానే గడుస్తున్నాయి. అయితే, తనకుమట్టుకు, ఈ నెలరోజులూ చాలా దుర్దినాలుగానే తోచినై.

మామయ్య ఉత్తరానికి, తను ఏ సమాధానమూ ఇంతవరకూ ఇయ్యలేదు, మామయ్య ఎప్పుడు వచ్చి పడ్తాడో అనే శంక ఒకటి తనకు పట్టుకుంది.

సరోజిని రోజూ 'ఆఫీసు'కి వెడుతున్నది. ఒక్కొక్క రోజు ఆలస్యమయితే, రామచంద్రమే దిగబెడతాడు. ఇది చూస్తూ ఊరుకోవటం తప్ప, తను చేయగలిగే దేదీ కనిపించటం లేదు—రామచంద్రం పలకరిస్తే, తను పలకటంతప్ప!

ఒక్కొక్కనాడు సినీమా రాత్రి ఆట చూసి వచ్చేది సరోజిని—రామచంద్రంతోపాటు. తనకిది మరీ కంటకంగా తోచేది. సరోజిని పెళ్లి ఎందుకు అక్కర్లేదన్నదో, తన కిప్పుడు పూర్తిగా అర్థమవుతున్నట్టున్నది.

దినదినానికీ ఎక్కువవుతున్న ఈ మనోవ్యథతో, ఇటువంటి జీవితం ఎన్నాళ్లు గడపటం? తన కొక ఇల్లూ, సంసారం ఉండాలనే కోరిక ఎంత దెబ్బతిన్నదో ఇప్పుడు తెలుస్తున్నది. సరోజినిని గుడ్డిగా లేవదీసుకువచ్చిన ఫలితం అనుభవిస్తున్నట్టు తోచసాగింది.

సరోజినిలో కూడా కలిగిన మార్పు తను కనిపెట్టకపోలేదు. ఆమె ఇప్పుడు మునపట్లలే మాట్టాడటం లేదు, ఏదన్నా మాట్టాడితే, తన ఆఫీసు వ్యవహారాలు చెప్తుంది. రామచంద్రం గొప్ప హృదయంగలవాడంటుంది. మొదట్లో తనకుకూడా అట్లా అనే ఉచ్చేసింది!

సరోజినిని అర్థం చేసుకొనటంలో గొప్ప పొరపాటు పడ్డట్టనిపించింది. అసలు సరోజిని మనస్తత్వం ఏమిటో తనకు సరిగా అంతుపట్టలేదు. తన్ను భర్త విడిచిపెట్టాడని చెప్పినప్పుడు, ఆ విషయం ఆనాడు తను పూర్తిగా విశ్వసించటంలోనే పప్పులో కాలు వేశాననుకున్నాడు. భర్తను విడిచిపెట్టి, తన్ను మరిగినట్టే, ఇప్పుడు తన్ను విడిచి, రామచంద్రంగాణ్ణి

మరగబోతున్నది. ఈ సరోజిని ఏ పురుషునితోనూ స్థిరంగా కాపరం చేయలేదన్నమాట. ఏ ఇంగ్లండు లోనో, అమెరికాలోనో పుట్టవలసింది, తప్పిజారి ఈ దేశంలో పడింది! సరోజిని మొట్టమొదట తన్ను కలుసుకొన్నప్పుడు సరోజినిలో ఈ గుణం తను చూడలేకపోవటం, తన అజ్ఞానం, అనుభవశూన్యత, కాకుంటే మరేమిటి?

అసలు, తనూ సరోజినీ ప్రేమించుకొంటున్నట్టా లేనట్టా?

ప్రేమేమిటి ప్రేమ! అసలు ఎక్కడుందీ ప్రేమ? అంతా మట్టిగడ్డ! తనకూ సరోజినికీ మధ్య ఉంటున్నది ప్రేమ అనుకోడానికి వీలులేదు. తనూహించిన ప్రేమ అనేక విశ్వాసాలతోనూ, త్యాగాలతోనూ కూడుకున్నది.

ఇక్కడికి 'ఎడ్వంచరు'కి స్వస్తి చెప్పి, శెలవు మీద చక్కగా ఇంటికి పోయి ఆ అరుంధతి నే పెళ్ళి చేసుకుంటే మంచిదిగా తోచింది శ్రీనివాసరావుకి.

ఏదో ఒకనాటి పొరపాటువల్ల తన కాలు జారిందని ఒప్పుకొని, ఈ బురదలోంచి, ఇప్పటి కేనా కాలు తీసి కడుక్కోవటం బుద్ధిమంతుని లక్షణం!

"నే నొకసారి ఊరికి పోయివస్తాను" అన్నాడు తను.

"అమ్మను తీసుకొస్తారా?" అన్నది సరోజిని.

"ఎందుకూ? ఎక్కడుంటుంది తెస్తే?"

"ఏం? మనతోపాటు ఉండదూ?"

"బాగా చెప్పావు! మా అమ్మ మన వ్యవహారం వింటే, ఉరిపోసేసుకుంటుంది!" అన్నాడు తను కాస్త ఎత్తిపొడుపుగా.

"ఏం! మనం మామూలు భార్యాభర్తలల్లే ఉంటున్నామన్న నమ్మకం మీకు లేదా? నా కా నమ్మకముంది. చిల్లరమల్లర అభిప్రాయభేదాలు ఎంత వాళ్లకన్నా వస్తాయి. వాటినే మనసులో పెట్టుకొని, తోచినకాటికి నిర్ణయాలు చేసుకుంటూ ఉంటారా?"

మాటలలో ఎంత నేర్పు! ఈ నేర్పరితనానికే తను ఇదివరకు ముగ్ధుడైపోయి దాసుడైనాడు కద! మళ్ళీనా! తను పనికొచ్చే దట్లానో బుజువు చేసుకో వలసిన సమయం వచ్చిందనుకున్నాడు తను.

"ఉహూఁ! మనం - నువ్వూ నేనూ, మామూలు భార్యాభర్తలల్లేనే ఉంటున్నాం. సందేహ మేమిటి? మామూలు భర్తలు అంతా కూడా తమ భార్యల్ని ఇతరులతో సినీమాలకు వెళ్లనిస్తారు. ఇష్టం వచ్చిన ఉద్యోగాలు చేసుకోనిస్తారు. ఒక్కొక్క రాత్రి భార్యలు ఇంటికి రాకున్నా దిగులుపడరు" అన్నాడు తను గుండెలో మంటంతా వెళ్ళగక్కుతూ.

"నామీద మీకు ఉన్నట్టుండి ఇంత అనుమానం ఎందుకు పుట్టిందో అర్థం కావటం లేదు. అసలు మొగాడి బుద్ధే ఇంతేనేమో!"

"ఆడదాని బుద్ధికన్నానా?"

"కనీసం నావంటి ఆడది, తనకు న్యాయమైనదని తోచింది చేస్తుంది."

"నిజమే. ఆ చేస్తున్న పనివల్ల, తనతో సంబంధంగలవారికి ఏం నష్టం వస్తుందనిగానీ, ఏ బాధ కలుగుతుందనిగానీ కూడా నీ వంటిది ఆలోచించదు."

"చూడండీ! మన వాదనకి అంతంటూ ఉండదు. మీరు మిమ్మల్నీ, నే నేమో నన్ను సమర్థించుకోటానికే ప్రయత్నిస్తాం. ఎవరి విశ్వాసాలు వాళ్ళవి. నేను మిమ్మల్ని ఏవిధంగానూ అన్యాయం చేయలేదని నా అంతఃకరణే చెప్తున్నది. అసలు నేను ఎవరికళ్లూ కప్పే స్వభావం కలదాన్ని కాను! నా మీద మీకున్న అనుమానాలకి ఆధారంలేదు కూడాను. ఈమాట నేను చెప్తే మీరు నమ్మకపోవచ్చును. నమ్మించటానికి నేను ఎక్కువ శ్రమకూడా పడను. అటువంటి పనిలో నాకు విశ్వాసంలేదు. మిమ్మల్ని నమ్మి నేను మీతో ఎట్లా ఉండగలుగుతున్నానో, అదేవిధంగా నన్ను మీరునమ్మి, నాతో ఉండగలరనే విశ్వసించాను. ఈ విశ్వాసంలో అర్థంలేదని మాత్రం బుజువుచేయకండి" అన్నది సరోజిని.

మళ్లా ఎంత పసందైనమాటలు! ఎక్కడో నేర్చుకున్నట్టే మాట్లాడి ఇట్లే బంధించటానికి ప్రయత్నిస్తుంది సరోజిని! ఒకసారి మోసపోయి, ఇంతకు వచ్చింది!

సరిగ్గా ఆ వేళ రాత్రే సరోజిని రామచంద్రంతో కలిసి, రాత్రిఆటసినీమా చూసి ఏ ఒంటిగంటకో

ఇల్లు చేరింది. సినీమానుంచి వస్తున్నానని చెప్పింది గాని, సినీమాకే పోయిందో, రామచంద్రం ఇంటినుంచే వస్తున్నదో పరమాత్ముడనేవాడు ఉంటే, వాడికే తెలియాలి. ఈ వ్యవహారం ఇంక తను భరించరానిది. ఎంత త్వరలోపోయి పెళ్ళిచేసుకొనివచ్చి వేరే యిల్లు చూసుకుంటే అంత మంచిది. ఇక ఈ సరోజిని తన దెలాగూ కాదు. తనకు భార్యగా ఒక స్త్రీ ఉండవలసిన అవసరం ఎంతేనా ఉన్నట్టు తోస్తున్నది. అరుంధతే తనకు రాసిపెట్టి ఉంది అదెలా తప్పుతుందీ?

మర్నాడు శ్రీనివాసరావు ఊరికి బయల్దేరే ముందు తను వస్తున్నట్టు మామయ్యకు టెలిగ్రామిచ్చాడు.

9

దాదాపు ఏడాదిపాటు పట్నంలో గడిపి వచ్చాక, మళ్ళీ తల్లిని చూడగానే శ్రీనివాసరావు కళ్ళు చెమ్మగిల్లినై.

తను చాలా కాలానికి తల్లిని, చూడగలిగానని కాదు. తల్లి కళ్లుకప్పి, ఘోరమైన అపచారం చేశాననే పశ్చాత్తాపంవల్లనే తన కళ్ళు చెమ్మగిల్లినట్టు తెలుసుకున్నాడు.

స్టేషనులో అడుగు పెడ్తూనే, అందరికళ్లూ తన మీదనే ఉన్నట్టు అనుమానం వేసింది. అంతా తన్ను వింతగా మృగాన్ని చూస్తున్నట్టు చూస్తున్నారనిపించింది. శరీరంమీద తేళ్ళూ, జెర్రులూ పాకుతున్నట్టనిపించింది.

తన్ను చాలా సహజంగా చూసింది ఒక్క మామయ్యే! ఎంతకేనా కూతుర్నికన్న మామయ్య!

“ఎప్పుడో ఒకప్పుడు నువిట్లా తిరిగివస్తావని నాకు తెలిసినదే! ఎన్నాళ్లు శెలవు పెట్టావు?” అన్నాడు మామయ్య! ఆ మాటలకు తనకెంతో సిగ్గ వేసింది!

“ఆశే లేదు. వారం రోజులే, మళ్లీ వెంటనే వెళ్ళకుంటే, పత్రిక దెబ్బతింటుంది” అన్నాడు తను. అసలు పెళ్ళి సన్నాహాలు ఆ యింట్లో, కొంత కాలంబట్టి జరుగుతున్నట్టుగానే ఉంది! తను రావటమే తడవుగా చేశారు!!

అరుంధతి తన్ను తప్పుకు తిరుగుతున్నది. ఇటీవల ఆ పిల్ల వొళ్లు చేసింది! ఇదివరకు కనిపించని అందం ఇప్పుడు ఆ పిల్లలో తనకు కనిపిస్తున్నది! తనంటే అరుంధతి అసహ్యపడుతున్నదా? లేక పెళ్లి సిగ్గా! కనీసం, అరుంధతైనా తన్ను ప్రేమించగలదా? తను ఆపని చేయగలడా?

ఈ ఆలోచనలతోనే, ఆనాటి సాయంకాలం, తన ఏకాంత ప్రదేశానికి వెళ్ళాడు శ్రీనివాసరావు.

రెండు బండలమధ్య, చిన్న రాతిమీద కూర్చొని, ‘నే నెందుకు పనికొస్తాను?’ అనుకున్నాడు.

ఈ పెళ్ళి చేసుకొని, సరోజిని భరతంపట్టాలి. సరోజిని గుండెలో మంటలు రేకెత్తించాలి. అప్పటికిగాని తనకు శాంతి అంటూ ఉండదు.

పెళ్లి సవ్యంగానే జరిగిపోయింది.

ఆ మర్నాడే తను బయల్దేరాలి. కాని వెంటనే వెళ్ళటానికి కొన్ని ఆటంకాలు ఏర్పడినై. ఇంకొక వారం రోజులు శెలవు పొడిగించవలసివచ్చింది. పత్రికాధిపతికి పెద్ద ఉత్తరం రాశాడు శ్రీనివాసరావు - ఈ వారం గడిచాక, తప్పక వస్తున్నానని.

రెండు రోజులు గడిచాక, హటాత్తుగా తనకు, సరోజిని రాసిన ఉత్తరం అందింది. ఇటువంటి దెన్నడూ జరగదనుకొన్న తనకు, ఈ ఉత్తరం మళ్ళీ మనోవ్యధ తెచ్చిపెట్టింది.

సరోజిని, చాలా టూంకీగా రాసింది.

“మీ రెప్పు డొస్తున్నారు? ఇన్ని రోజులు ఎందు కుండిపోయినారు? మీకోసం ఎదురుచూస్తున్నాను. నాదే పొరపాటేమో! మీ రొచ్చినవెంటనే పెళ్లి...” ఆతర్వాత మరి చదవలేకపోయినాడు తను.

తనలో కూడా కొంత పొరపాటున్నట్టు తోచింది. సరోజిని రాసిన ఆ ముక్కలు తన్ను తీవ్రంగా బాధపెట్టసాగాయి. సరోజిని అటువంటి నిర్ణయానికి రాగలదని కూడా తను ఊహించలేకపోయినాడు. తన్ను ఎంత నమ్ముకొని ఉండకపోతే సరోజిని అట్లా రాస్తుంది! సరోజినిని ఎంత ద్వేషించాడు! తన అనుమానం అంతా అబద్ధమేనా?

ఈ పెళ్లి చేసుకోవటంలో, మళ్ళీ పెద్ద పొర

పాటయిపోయింది. ఇప్పుడీ 'భార్య'ను ఏం చేయటం? ఎటా తీసుకువెళ్లటం? ఏం చేయాలి? ఏం చేయగలను? ఎందుకు పనికొస్తాను? తన్ను వెంటాడే ప్రశ్నలు మళ్ళీ ప్రత్యక్షం!

ఇప్పుడు సరోజినికి సమాధానం రాయవలసిన బాధ్యత ఒకటి ఉంది. ఏమని సమాధానం రాయటం? ఉన్నదున్నట్టు రాసేస్తే?

పెళ్లి మూడోనాటి రాత్రి, అరుంధతిని గదిలో కలుసుకొన్నప్పుడు, శ్రీనివాసరావు,

"అరుంధతీ! నువు నన్ను క్షమించవలసి ఉంటుంది!" అన్నాడు.

అరుంధతి బిత్తరపోయింది!

భార్యను పక్కను కూర్చోపెట్టుకొని, తను చేసిన పొరపాటేమిటో పూసగుచ్చినట్టు చెప్పేశాడు శ్రీనివాసరావు.

"నన్నేం చేయమంటావు చెప్పు! నా ప్రారబ్ధం. నీ జీవితంలో నీకు సుఖం లేకుండా చేస్తున్నాను చూస్తూచూస్తూ" అన్నాడు.

"మీ రెక్కడుంటే అక్కడే నేనూనూ మీతోపాటే తీసుకొనిపోండి" అన్నది అరుంధతి.

పతివ్రతల కథలు బొత్తిగా అబద్ధాలు కావని పించింది తనకు.

మర్నాడు శ్రీనివాసరావు సరోజినికి ఉత్తరం రాశాడు.

"సరోజినీ! నువు నన్ను క్షమిస్తావనే నమ్మకంతో నీకీ సంగతి చెప్పటానికి సాహసించాను. నీ ఉత్తరం అందింది. విన్ను అనవసరంగా అనుమానించిన పాపం నన్ను చుట్టుకుంటుందిలే. ఆ పాప ఫలం అనుభవించవలసింది నేనే. నీమీద అనుమానంతో ఆ బాధ భరించలేక నేను పెళ్లిచేసేసుకున్నాను. అందుకే వొచ్చాను కూడాను. నువు క్షమించి మా ఇద్దర్నీ స్వీకరించగలవనే నమ్మకంతోనే, మరో నాలుగురోజులలో వస్తున్నాం. అమ్మ కొన్నాళ్లిక్కడే ఉంటుంది."

10

శ్రీనివాసరావు భార్యాసమేతుడై పట్నం చేరుకునేసరికి ఇంటి తలుపులు తాళాలువేసి ఉన్నై.

కారణం ఊహించుకునేలోపుగానే పక్కింటి వాళ్ళు తాళాల చెవి తెచ్చి ఇచారు.

"అమ్మగారు ఏదో ఊరికిపోయినారండి" అని సమాధానం కూడా వచ్చింది.

సరోజిని, ఏ ఊరికి వెళ్ళిఉంటుంది. అనుకుంటూనే తాళంతీసి లోనికి ప్రవేశించాడు శ్రీనివాసరావు. అరుంధతి కూడా లోనికి వెళ్లింది. బండీవాడు సామాను తెచ్చి పడేశాడు.

ఎదురుగా గదిలో మంచంమీద కనిపిస్తూనే ఒక కవరు ఉంది. అది సరోజిని రాసిపెట్టిన ఉత్తరం.

వణకుతున్న వేళ్ళతో ఆ ఉత్తరంతీసి శ్రీనివాసరావు చదువుకున్నాడు.

"శ్రీనివాసరావుగారు! మిమ్మల్ని ఇట్లానే పేరుపెట్టి పిలవాలనిపిస్తున్నది మీ రింత ద్రోహానికి తలపడతారనుకోలేదంటే నమ్మండి. మీ ఉత్తరం అందకమునుపే మీ పత్రికా ఆఫీసులో కనుక్కొంటే చెప్పారు. మీ పెళ్ళి శుభలేఖ చూశాను అక్కడ. నాకూ్కడా ఒక శుభలేఖ పంపటానికి మీకు ముఖం ఎట్లా చెల్లుతుంది మరీ? నేను తెలిసి, మీకు ఎటువంటి అన్యాయమూ చేయలేదు. అందుకు నా అంతఃకరణే సాక్షి అని రెండోసారి చెప్తున్నాను. నాకూ రామచంద్రంగారికీ ఏదో సంబంధం ఉన్నట్టు మీరు ఊహించి, పాపం చాలా బాధపడ్డారు. మిమ్మల్ని నేను నమ్మించలేక పోయినాను. కసి తీర్చుకోడానికి వెళ్ళి, నాతో చెప్పకుండా పెళ్ళిచేసుకున్నారు. ఇక మీకూ నాకూ పొసగదనే మాటేగా!

"మీరు వెళ్ళిపోయాక మీకోసం నేనెంత బాధపడ్డానో, ఆ బాధలోనే, నా విశ్వాసాలను కూడా లక్ష్యంచేయక, మనం పెళ్లిచేసుకుందామని, ఎట్లా రాశానో, తలుచుకుంటే నాకే ఆశ్చర్యం వేస్తుంది! పైగా మీరు క్షమించమన్నారు! నేనిటువంటివి క్షమించలేను! కొన్నాళ్లపాటు, ఒక 'గొప్ప కథకుడి' స్నేహం, సాహచర్యం, పొందగలిగానని నా జీవితాంతం జ్ఞాపకం ఉంచుకుంటానులెండి.

"రామచంద్రంగార్ని మీరు అంత అనుమా

నించవలసిన కాలం పోయింది. మీమీద నాకు ఉండిన నమ్మకంతో, అనేకసార్లు ఆయన గుండె గాయపరిచాను కూడాను. ఆయనకు హఠాత్తుగా ఢిల్లీ బదిలీ అయింది. నన్ను తమకు పర్సనల్ అసిస్టెంటుగా రమ్మన్నారు. మూడువంద లిస్తారుట. ఇక ఇక్కడ నాకేముంది? వారివెంట పోతున్నాను.

"సాధ్యమైనంత త్వరలో నన్ను మరిచిపోతే, మీరు ముందుకొస్తారు. ఇక నా కథకూడా పూర్తి అయినట్టే! మీరు కథకులు గనక, మీ పత్రికలో చక్కని 'సీరియల్' రాయండి, నాకో కాపీ పంపుతూ ఉండండి. ఇదే నా కోరిక.

"మీ భార్య అరుంధతికి నా దీవనలు చెప్పండి. ఇట్లు——సరోజిని——"

శ్రీనివాసరావు కాళ్లు తేలిపోవటం ప్రారంభించినై.

అతను మంచంమీద, ఉన్నపళంగా కూలపడ్డాడు.

"ఏమండీ! ఏం జరిగింది?" అన్నది అరుంధతి ఏదీ అర్థంకాక.

"అరుంధతీ!" అన్నాడు తను ఆమెను దగ్గరగా తీసుకొని.

శ్రీనివాసరావు కళ్లలో, నీళ్లు ఎందుకు తిరుగుతున్నాయో అర్థంకాని అరుంధతి - తన పైట కొంగుతో, అతని కళ్లు తుడిచింది.

కాసేపు పోయాక,

"అరుంధతీ! నిన్ను అన్యాయం చేశానా?" అన్నాడు శ్రీనివాసరావు.

ఈ ప్రశ్న తన ఆత్మపరీక్షలోంచి వచ్చినదే అని మాత్రం, ఆ క్షణంలో శ్రీనివాసరావుకి తట్టలేదు.